

కథా కౌముది

# శరణం గచ్ఛామి

- సత్యం మందపాటి

**శ్రీ హేవళంబ నామ సంవత్సర ఉగాది సందర్భంగా**
**వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన**
**22 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో**
**ఉత్తమ కథానిక విభాగం విజేత**

**మనోహరానికి** ఆరాత్రి కూడా, ప్రతి రాత్రిలాగానే, అసలు నిద్ర పట్టలేదు.

ఆదమరచి సుఖ నిద్రపోవటానికి సహకరించే ఎన్నో సాంకేతిక సౌకర్యాలున్న, అత్యంత ఖరీదైన మంచం మీద పడుకున్నా, ఎందుకో మరి అతనికి నిద్ర పట్టదు. ఏసి గాలి చల్లగా శరీరానికి తగులుతుంటే హాయిగా వుందిగానీ, మధ్యే మధ్యే ఏవో ఆలోచనలు వచ్చి చెమటలు పడుతున్నాయి. మంచం మీద నించీ లేవకుండానే, రిమోట్ కంట్రోలుతో సీలింగ్ ఫాన్ ఆన్ చేశాడు. కాలితో దుప్పటి పక్కకి నెట్టేశాడు. గట్టిగా కళ్ళు మూసుకున్నా నిద్ర పట్టడంలేదు. ఇక కళ్ళు తెరుచుకునే చూస్తూ పడుకున్నాడు.

గోడ మీద తన జీవిత కథ ఒక సినిమాలాగా కనిపిస్తున్నది. తండ్రి వున్న రెండెకరాల పొలాన్ని అమ్మేసి, తన చిన్నప్పుడే పాల వ్యాపారం మొదలుపెట్టాడు. ఎంతో న్యాయబద్ధంగా వ్యాపారం చేస్తూ, తను నమ్ముకున్న వారికి చేతనైన సహాయం చేస్తూ మంచి పేరు తెచ్చుకున్నాడు. త్వరలోనే వ్యాపారం పెరిగి నాలుగింతలయింది. దానితోపాటూ ఎన్నో సేవా కార్యక్రమాలకి ధన సహాయం చేయటమే కాకుండా, పేదలకి చదువు చెప్పించటం, భోజన సదుపాయాలు చేయటం, పేద వికలాంగులకి సహాయం చేయటం కూడా ఆయన చేస్తూ వుండేవాడు. తనకి దక్కవలసిన ఆస్తి అలా హరించుకుపోతుంటే మనోహరానికి నచ్చలేదు. తండ్రి కూడా ఎంత చదువుకుంటే అంత చదువు చెప్పిస్తాను కానీ, ఆస్తి అంతా ఒక్కగానొక్క కొడుకువయినా సరే ఇవ్వనన్నాడు. ఎవరి జీవితాన్ని వాళ్ళు సరిగ్గా నడిపించుకోవాలి కానీ, ఇంకొకళ్ళ మీద ఆధారపడకూడదన్నాడు. ఆయన తన విల్లు అలా వ్రాసే లోపలే గుండెపోటుతో మరణించాడు. అది గుండెపోటుతో వచ్చిన మరణం కాదనీ,

కొడుకే తండ్రి మరణానికి కారకుడనీ ఎంతోమందికి అనుమానం వచ్చినా, అసలు రహస్యం తనకీ, అలా అని సర్టిఫికేట్ ఇచ్చిన డాక్టరుకీ తప్ప ఇంకెవరికీ తెలియదు.

అలా తండ్రి ఆస్తి అంతా తన చేతిలో పడ్డాక, రాజకీయాల్లోకి దిగి ఎన్నో పదవులు సంపాదించాడు. దానితో పాటు డబ్బు కూడా స్విస్ బాంకులు, సింగపూర్ బాంకులు నింపేటంతగా పెరిగిపోయింది.

"ఇంకా నీకెందుకయ్యా ఆ డబ్బు కాపీనం, నువ్వు పైకి వెళ్ళేటప్పుడు ఏ లగేజీ తీసుకు వెళ్లనీయరు కదా. అదీకాక నీ రాజకీయాల వల్ల ఎంతోమంది మిత్రులనీ, బంధువులనీ కోల్పోతున్నావు కూడాను" అని తన ప్రియ మిత్రుడు అంటే, "అదీ చూద్దాం.. ఈలోకంలో డబ్బుతో కొనలేనిది ఏదీ లేదు. ఆ దేవుడినే కొనగలను నేను. ఇక బంధు మిత్రులంటావా, ఎవ్వరూ లేకపోయినా, నేను నా డబ్బుతో ఒంటరిగా హాయిగా బ్రతకగలను" అన్నాడు.

గోడ మీద సినిమా చూస్తుండగానే నిద్ర పట్టేసింది మనోహరానికి. ఆరోజు ఎవరూ నిద్ర లేపక పోవటంతో,

మనోహరం ఆలస్యంగా నిద్ర లేచాడు.

రోజూ మంచం పక్కనే వంట మనిషి సుమిత్ర పెట్టే కాఫీ లేదు. అక్కడి నించే ఇంటర్కంలో వంటగదికి ఫోన్ చేశాడు. జవాబు లేదు. క్రింద ఆఫీసులో కూర్చునే సెక్రటరీ బాపినీడుకి ఫోన్ చేశాడు. ఆయనా పలుకలేదు. తనకి చేదోడువాదోడుగా వుండే పనివాడు ఆంజనేయుల్ని పిలిచాడు అతనూ పలకలేదు. విసుక్కుంటూ బెడ్రూములో నించీ బయటికి వచ్చి, మేడ మీద నించే క్రింద అన్ని గదుల వేపూ పరికించి చూశాడు. ఎక్కడా ఎవరూ వున్న అలికిడి లేదు. ఒక్క సెక్రటరీ తప్ప, అందరూ తన ఇంట్లో వుండేవాళ్ళే, మరి వీళ్ళందరూ ఎక్కడికి వెళ్ళారు?

మెట్లు దిగి వంట గదిలోకి వెళ్ళాడు. సుమిత్ర లేదు అక్కడ. కాఫీగానీ, టిఫిన్ కానీ చేస్తున్న ప్రయత్నాలేవీ కనపడలేదు. రోజూ ఆ సమయానికి వచ్చి, గుడ్ మార్నింగ్ చెప్పే బాపినీడు కూడా కనపడలేదు. ఆంజనేయులు కూడా లేడక్కడ. తన మూడు కార్లూ అక్కడే వున్నాయిగానీ, రోజూ కార్లు కడుగుతూ కనిపించే డ్రైవర్ రాముడు మాత్రం లేడు. కొంచెం ఆశ్చర్యపోతూ, బాల్కనీలో నించీ బయటికి చూశాడు. ఒక్కసారిగా బిగుసుకు పోయి, కళ్ళు నులుముకుని మళ్ళీ చూశాడు.

కదలటానికి కూడా చోటు లేకుండా వెళ్ళే కార్లు, రోడ్లు ఎలా దాటాలో అర్ధంకాక హడావిడి పడిపోయే వందల మంది జనం నడిచే రోడ్డు మీద, ఆరోజు ఎవరూ లేరు. అంతా నిర్మానుష్యంగా వుంది. తనకి తెలిసి ఆ రోజు ఏ సమ్మె కానీ, బందుగానీ లేవే! అలా అయినా కనీసం ఆ సమ్మె చేసే వాళ్ళు మందలుమందలుగా వుంటారే, వాళ్ళూ లేరు.

ఏమీ అర్ధం కాలేదు మనోహరానికి.

బాపినీడు సెల్ ఫోనుకి ఫోన్ చేశాడు. ఎంతసేపు మ్రోగినా, అతను ఫోన్ తీయలేదు. అతని ఇంటి ఫోనులో పిలిచాడు. అతనుగానీ, అతని భార్య, పిల్లలు ఎవరూ ఫోన్ తీయలేదు. తన కేబినెట్లో వున్న ఇద్దరు ముగ్గురు మంత్రులకీ, వాళ్ళ సెక్రటరీలకీ ఫోన్ చేశాడు. జవాబు లేదు. కొందరు మిత్రులకీ ఫోన్ చేశాడు. జవాబు లేదు. తిరిగి పిలవమని అందరికీ మెసేజీలు పెట్టాడు.

కాఫీ త్రాగాలనిపించిందిగానీ, తనకి కాఫీ ఎలా పెట్టుకోవాలో కూడా తెలీదు. భార్య మరణించాక, తన అవసరాలు బయటే తీరుతున్నాయి కనుక మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. ఇంకో కులం అతన్ని పెళ్ళి చేసుకుంటానని అన్నదని, కన్నకూతురిని ఇంట్లో పెట్టి తాళం వేశాడు. చక్కటి ఉద్యోగం చేసుకుంటున్న 'అల్లుడు కాలేకపోయిన అల్లుడికి' ఆ ఉద్యోగం తీసివేయించాడు. కూతురు ఎలాగోలా బయటపడి, అతనితో పాటు లేచి వెళ్ళిపోయింది. ఏ వూళ్ళో వుందో ఎవరికీ తెలీదు. ఇద్దరూ కలిసి లండనో, సింగపూరో వెళ్ళిపోయారనీ, అతనికి అక్కడే మంచి ఉద్యోగం వచ్చిందనీ కొన్ని పేపర్లు వ్రాశాయి. ఇద్దరూ కలిసే ఆత్మహత్య చేసుకున్నారని, దానికీ మనోహరమే కారణమనీ ఇంకా కొన్ని పేపర్లు వ్రాశాయి. దానితో జగమంత రాష్ట్రానికి మంత్రి అయినా, తనది ఏకాకి జీవితం అయిపోయింది.

తెలిసిన రెష్టారెంటుకి ఫోన్ చేశాడు, కాఫీ టిఫిన్లు తెప్పించుకుందామని. అక్కడా ఎవరూ ఫోన్ తీయలేదు. ఇంకా రెండు మూడు రెష్టారెంట్లకి ఫోన్ చేశాడు. అక్కడా అంతే!

ఏమయింది వీళ్ళందరికీ? తన మీద కక్ష్య కట్టారా? ఏమీ అర్థం కాలేదు మనోహరానికి.

టీవీ పెట్టాడు. ఏవో రికార్డు చేసి వేస్తున్న సినిమాలు, డాక్యుమెంటరీలు తప్ప, ఏ ఇండియా ఛానళ్ళుగానీ,

విదేశీ ఛానళ్ళుగానీ – ఎక్కడా వార్తలు రావటం లేదు. ఏమిటో గాభరా వేసింది.

గబగబా తయారయి, కారు బయటికి తీశాడు. తనకి డ్రైవింగ్ అలవాటు తప్పినా, రోడ్లు ఖాళీగా వున్నాయి కనుక, ధైర్యంగానే రోడ్డు మీదకి కారులో వచ్చాడు.

రోడ్ల మీద ఎక్కడా మనుష్య సంచారం కానీ, కార్లు ఆటోలు కానీ ఏమీ కనపడలేదు. అన్ని షాపులూ తెరిచే వున్నాయి. లోపల రాత్రిపూటలా లైట్లన్నీ వేసివున్నాయి.

అక్కడే వున్న ఒక రెష్టారెంటుకి వెళ్ళాడు. తెలుపులు బార్లా తెరిచే వున్నాయి కానీ ఎవరూ లేరు. కాష్ కౌంటర్ తెరిచే వుంది. దాని నిండా ఎంతో డబ్బు కూడా వుంది. కిచెన్లోకి వెళ్ళాడు. అక్కడా ఎవరూ లేరు. పక్కనే వండిన పదార్థాలు ఏవో వున్నాయిగానీ, ఎన్నో గంటల ముందు చేసినట్టు చల్లగా వున్నాయి. పక్కనే వున్న పెద్ద ఫ్రిడ్జిలో చాల వున్నాయి. అక్కడే వున్న మైక్రోవేవులో వేడి చేసుకుని ఆత్రంగా తిన్నాడు. కొంచెం ఆరెంజ్ జ్యూస్ రెండు గ్లాసుల నిండా పోసుకుని త్రాగాడు. బయటకి వచ్చి చూస్తే, పరిస్థితి ఇంకా అలాగే ఖాళీ రోడ్లతో కనిపించింది.

దగ్గరలోనే వున్న సూపర్ బజారులోకి వెళ్ళాడు, అక్కడా ఎవరూ లేరు. ఒక పక్క కూరలూ, పప్పులూ, మిగతా దినుసులూ ప్లాస్టిక్ సంచుల్లో ఎన్నో వున్నాయి. కొంచెం ఇవతలికి వస్తే అక్కడే, రకరకాల ఖరీదైన టీవీలు, స్టీరియోలు, కెమేరాలు, కంప్యూటర్లు, ఎన్నో కోట్ల రూపాయల సరుకు వుంది. అక్కడా ఎవరూ లేరు. పక్కనే మేడ మీదకి మెట్లు వున్నాయి. అంతకముందు అక్కడే బట్టలు కొనుక్కున్నాడు. అన్ని కోట్ల రూపాయల సరుకు అలా వదిలేసి, ఎవరూ లేకుండా... ఏమిటో అంతా విచిత్రంగా వుంది.

పక్కనే వున్న అన్ని కౌంటర్లలో డ్రాయర్లు తీసే వున్నాయి. అన్నిటినిండా అమ్మగా వచ్చిన ఎంతో డబ్బు, క్రెడిట్ కార్డు రసీదులు వున్నాయి. కొంత డబ్బు తీసి జేబులో పెట్టుకున్నాడు. పై అంతస్తులో నగలు అమ్ముతారు. క్రింద నించీ ఒక సూట్కేస్ తీసుకుని, దాన్నిండా కొన్ని డైమండ్ నెక్లెసులు, ఇతర బంగారం నగలు నింపాడు. లిఫ్ట్ ఎక్కి క్రిందకి దిగాడు.

కారు ఎక్కబోతుంటే అనిపించింది. తను కల కనటం లేదు కదా.. గిల్లుకోవాల్సిన అవసరం లేకుండానే కాదు అని తెలుస్తూనే వుంది. తను నడుపుకుంటూ వచ్చిన కారు ఎదురుగా అక్కడే వుంది మరి!

మరి కళ్ళ ముందు కనపడుతున్నది ఎలా నమ్మటం? లేదా నమ్మకపోవటం?తల తిరిగిపోతున్నది. మళ్ళీ కారు ఎక్కి తనకి తెలిసిన పోలీసు స్టేషనుకు వెళ్ళాడు. అక్కడా ఎవరూ లేరు. పోలిసులే కాదు, పక్కనే వున్న జైలులో దొంగలు కూడా లేరు. స్టేషన్ తలుపులు తెరిచే వున్నాయిగానీ, జైలు గదుల తలుపులు మాత్రం వేసి వున్నాయి. సెక్రటేరియట్టుకి, టీవీ స్టేషనుకి వెళ్ళాడు. అక్కడా ఎవరూ లేరు. వస్తూ వస్తూ న్యూస్ పేపరు షాపు దగ్గర ఆగాడు. ఏవో వారపత్రికలూ, మాస పత్రికలూ వున్నాయిగానీ, ఆరోజు వార్తాపత్రికలు ఏవీ లేవు.

అతనికి వెన్నులో వణుకు పుట్టింది. భయంతో చెమటలు పట్టాయి. గుండె విపరీతంగా కొట్టుకుంటున్నది. కళ్ళు మూసుకుని కారులో కాసేపు కూర్చున్నాడు. అక్కడ మనుష్య సంచారమే కాదు, రోజూ రోడ్డు పక్కన కనిపించే కుక్కలూ, ఆవులూ కూడా కనిపించలేదు. ఇక ఏంచేయాలో తెలియక ఇంటికి వెళ్ళాడు. దారిలో కూడా ఎవ్వరూ లేరు!

ఇంట్లోనూ ఇంకా ఎవరూ కనిపించలేదు. తను ఫోన్ చేసిన వారెవరూ తిరిగి పిలవలేదు. ఏమవుతున్నది? అతనికి కళ్ళు తిరిగినట్టు అయింది. గబగబా మంచం వేపు నడిచాడు. అంతే! తర్వాత ఏమయిందీ తెలియలేదు.

నెమ్మదిగా మెలుకువ వచ్చింది మనోహరానికి. అంతా చీకటిగా వుంది. నేల మీద పడివున్నాడు. అంతకుముందు జరిగినదంతా గుర్తుకొచ్చింది. ఛ! అలా ఎప్పుడూ జరగదు. ఏనాడో డైనాసోర్లు అన్నీ ఒక్కసారిగా అంతమైపోయినట్టుగా, ఇప్పుడు ఎంతో విజ్ఞానం వున్న మానవజాతికి అలా జరిగే అవకాశం లేదు. అదంతా కల. నిజమెలా అవుతుంది? కళ్ళు పూర్తిగా తెరుచుకుని లేచి లైటు వేశాడు. అంతా మామూలుగానే వుంది. అది బెడ్ రూం కాదు. వరండా. అంటే బెడ్ రూముకి వెడుతూ తను పడిపోయాడన్నమాట. మరి ఎవరూ లేపలేదే! ఇంటర్కమ్లో పనివాళ్ళన్నందర్నీ పిలిచాడు. ఎవరూ పలకలేదు. అప్పుడే టైమ్ చూశాడు. అర్ధరాత్రి పన్నెండు గంటలయింది. అందరూ నిద్ర పోతున్నారేమో!

వరండాలో సూపర్ బజారు నించీ నగలతోనింపి తెచ్చిన సూట్కేసు అక్కడే వుంది. అంటే అదంతా కల కాదా? నిజమేనా? అతనికి మళ్ళీ ఏదో గగుర్పాటులా వచ్చింది. చేతి మీద వెంట్రుకలు నిటారుగా నిలబడ్డాయి. నుదుటి మీద నొప్పిగా వుంది. చేత్తో తడిమితే, తడిగా తగిలింది. బాత్రూముకి వెళ్ళి, అద్దంలో చూసుకున్నాడు. రక్తంతో ఎర్రగా వుంది. అంటే తను కళ్ళు తిరిగి నేల మీద పడ్డప్పుడు, దెబ్బ తగిలిందన్న మాట. టవల్ నీళ్ళలో తడిపి, నుదుటి మీద శుభ్రం చేశాడు. ఒక గోధుమ రంగు బాండ్ ఎయిడ్ వేసుకున్నాడు.

క్రిందకి వచ్చి అన్ని గదుల్లోకీ వెళ్ళి చూశాడు. ఎవరూ లేరు. ప్రొద్దున్న ఎలా వుందో అలాగే వుంది. టీవీ పెట్టాడు, ఏమయినా వార్తలు తెలుస్తాయోమోనని. టీవీలో కూడా ఏమీ రావటం లేదు. కుర్చీలో కూర్చుని ఆలోచనలో పడ్డాడు.

అసలు ఏం జరిగింది? మనుష్యులూ, జంతువులూ, సర్వ జీవకోటీ ఒక్కసారిగా మాయమైపోవటమేమిటి? ఎప్పుడో ఏదో ఇంగ్లీషు సినిమాలో చూశాడుగానీ, నిజ జీవితం సైన్స్ ఫిక్షన్ సినిమా కాదు, ఇలాటివి జరగటానికి. మనవాళ్ళు చెప్పే నవ గ్రహ కూటములు కూడా ఇప్పుడు వస్తున్నట్టు ఎక్కడా చెప్పలేదు. మరి ఇదేమిటి? అయినా అందరూ పోయినా తను ఒక్కడే బ్రతికివుండటమేమిటి? తనలో ఏముందని? తనూ అందరిలాటి వాడే కదూ!

ఆమాట అనుకుంటున్నప్పుడు అతనికి అనిపించింది. తను అందరిలాటి వాడు ఎలా అవుతాడు? కోట్లకు కోట్లు సంపాదించాడు. ఎన్నో దేశాల్లో బాంకులు నింపేశాడు. అయితే ఏమిటి? ఇప్పుడు అందరూ మాయమయి పోయాక, తను ఆ డబ్బుని ఏంచేసుకుంటాడు? అన్ని బాంకుల్లోనూ డబ్బులు నింపిన ఇనప్పెట్టెలూ, లాకర్లూ, డ్రాయర్లూ అన్నీ తెరిచేవున్నాయి. ఎన్నో కోట్ల రూపాయల సామాన్లు, బంగారం వున్న షాపులూ తెరిచే వున్నాయి. తనకెంత డబ్బు కావాలంటే అంత! అప్పనంగా చేతికి అందేటంత దూరంలో వుంది. ఇప్పుడు ఆ డబ్బుకి విలువ ఏముంది? మనిషి తను సృష్టించుకున్న డబ్బుకి తనే బానిసయిపోయాడు. చిత్తు కాగితానికి లేని విలువని, పచ్చ కాగితానికి ఇచ్చి, లేనిపోని చిచ్చు సృష్టించాడు. మానవత్వం మరిచిపోయి సాటి మనుష్యుల్ని పీక్కుతింటున్నాడు. తను జన్మ చాలించినప్పుడు తీసుకు వెళ్ళలేని డబ్బు నింపిన బస్తాలని, పోయేదాకా మోయటం ఎందుకో?

మనోహరానికి గొంతు ఎండి పోతున్నది. చల్లటి నీళ్ళు రెండు గ్లాసులు గడగడా త్రాగాడు. తలమీద నీళ్ళు చిలకరించుకున్నాడు. ఎవరూ లేని ఈ ప్రపంచంలో తను మాత్రం ఎన్నాళ్ళు వుంటాడు? పంటలు పండించే వాళ్ళు లేక ఆహారం దొరకదు. పవర్ ప్లాంటులు పేలిపోయి కరెంటూ, దానితో పాటూ త్రాగే మంచి నీరూ పోతాయి. తనకి ఆరోగ్యం దెబ్బతింటే డాక్టర్లు లేరు. జీవితమంతా అంధకారబంధురమైపోతుంది. తనకి తోడుగా ఎవరూ లేని ఒంటరితనం చాలు తనని కృంగదీయటానికి. మనిషి సంఘజీవి. మహాజ్ఞాని బుద్ధుడు 'సంఘం శరణం గచ్ఛామి' అన్నాడు. సంఘం సజీవంగా వున్నప్పుడు, కులం పేరుతో, మతం పేరుతో, ప్రాంతం పేరుతో మన మధ్య మనమే గీతలు గీసుకుని, ఆ సంఘాన్ని తునకలు తునకలు చేసుకున్నాం. ఇప్పుడు? తనొక్కడే ఆ సంఘం!

ఇలాటి ఆలోచనలతో మనసు నిరాశతోనూ, శరీరం నిస్సత్తువతోనూ వుంటే, మళ్ళీ నేల మీద పడిపోకుండా మెల్లగా లేచి, మంచం మీద పడుకున్నాడు. అలసిసొలసి వున్నాడేమో, మనోహరానికి అలవోకగా నిద్రపట్టింది.

అలా ఎంతసేపు పడుకుని వున్నాడో కానీ, ఏదో చప్పుడయితే చటుక్కున కళ్ళు తెరిచాడు మనోహరం.

సుమిత్ర మంచం పక్కన టేబుల్ మీద కాఫీ కప్పు పెట్టి వెళ్ళిపోతున్నది.

ఠక్కున లేచాడు మనోహరం. 'సుమిత్రా' అని పిలిచాడు.

సుమిత్ర వెనక్కి తిరిగింది.

"అందరూ.. ఇక్కడే వున్నారా?" అడిగాడు ఆశ్చర్యం, ఆనందం అతన్ని ఒక్కసారిగా కుదిపేస్తుంటే!

"ప్రొద్దున్న పది గంటలు అయింది కదా.. అందరూ ఎవరి పనుల్లో వాళ్ళు వున్నారండీ. నేనే మూడు సార్లు కాఫీ చల్లారిపోతుంటే మళ్ళీ మళ్ళీ మంచి కాఫీ తెచ్చి ఇక్కడ పెడుతున్నాను" అంటూ వెళ్ళిపోయింది.

బాల్కనీలోకి వెళ్ళి క్రిందకి చూశాడు. కార్లూ, ఆటోలూ, మనుష్యులతో రోడ్డు ఎంతో సందడిగా వుంది.

అంటే ఏమీ జరగలేదన్నమాట. రోజూలాగానే ఈరోజూ తెల్లవారిందన్నమాట! మరి....?

అంటే జరిగింది కల అన్నమాట. మరి ఇది కల అయితే, ఇంతకుముందుది? కలలో వచ్చిన కలా? అసలు ఒక కలలో ఇంకొక కల వస్తుందా? ఏమిటో అంతా గందరగోళంగా వుంది మనోహరానికి!

అంతకు ముందు నగలతో తెచ్చిన సూట్కేసు పెట్టిన చోటికి వచ్చి చూశాడు. అక్కడ సూట్కేసు లేదు. అవును. అదంతా కలే? ప్రపంచమంతా నిర్మానుష్యమైపోవటం తన కలలో వచ్చిన కల అయివుండాలి!

దానితో ఎంతో ధైర్యం వచ్చింది మనోహరానికి. అదొక పిచ్చి కల అనుకున్నాడు.

తనలో తనే నవ్వుకున్నాడు.

బాత్రూములోకి వెళ్ళి బ్రష్ మీద టూత్ పేష్ట్ వేసుకుని, అద్దంలో చూసుకున్నాడు.

అతని నుదుటి మీద అతనే వేసుకున్న గోధుమ రంగు బాండ్ ఎయిడ్ స్పష్టంగా కనిపిస్తున్నది!

COMMENTS